క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవ పూజలు

పాల్వంచ: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం దేవాలయంలో పూజారి మాధవన్ నంబూద్రి, బృందావనం నరసింహామూర్తిల ఆధ్వర్యంలో గణపతి హోమం, కళాభిషేకం, అన్నదానం, పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. పూజల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కనగాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై గ్రామాల్లో నిరసనలు తెలపండి..



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ప్లాట్‌ఫాం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విఠల్‌రావు భవన్‌లో ఆలేటి కిరణ్, బంధం నాగయ్య, కె.సారంగపాణి, మల్లెల వెంకటేశ్వర్లు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో గ్రామాల్లో నిరసనలు కొనసాగించాలని, ర్యాలీలు చేపట్టాలని సభలు, సమావేశాలు జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నేత కె.సారయ్య, సీఐటీయూ నేత అబ్దుల్ నబీ, ఎన్డీ నేత తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంక్షలు ఎత్తివేయాలి



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇల్లెందు డిపో ఎదుట బుధవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) కార్మిక సంఘం ఆందోళన చేపట్టింది. నాయకులు కృష్ణ, వెంకటేశ్వర్లు, ఉపేంద్రాచారి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టినట్లు చెప్పారు. మస్టర్ల కుదింపు, పని గంటల పెంపు, డబల్ డ్యూటీ పేరుతో ఒత్తిడి పెంచటం, కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడం లాంటివి జరుగుతున్నాయని తెలిపారు. పీఎల్‌రావు, నజీర్, సురేష్, అంజయ్య, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కొత్త గనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి



జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో త్వరలో అనుమతి రానున్న వీకే–7 ఓపెన్ కాస్ట్ గనిలో ఓబితోపాటు, బొగ్గు ఉత్పత్తి పనులన్నా కంపెనీయే చేపట్టాలని ఏఐటీయూసీ నాయకులు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును కోరారు. ఈ మేరకు బుధవారం జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇల్లెందు ఏరియా పరిధిలోని కోయగూడెం ఓసీలో 2003లో సర్ఫేస్ మైనర్‌ను పెట్టవద్దని అన్ని యూనియన్లు నెలరోజులు సమ్మె చేసిన క్రమంలో యాజమాన్యం భవిష్యత్‌లో ఏ ఓసీ వచ్చినా ఏపనినైనా కంపెనీ యంత్రాలు, కంపెనీ కార్మికులతో చేయించడం జరుగుతుందని ఆనాటి అధికారులు హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఏరియాలో ఓపెన్‌కాస్ట్ గని వస్తే కార్మికులకు, స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుందని ఆశ పడిన స్థానికులకు నిరాశే మిగిలిందన్నారు. యాజమాన్యం ఇందులో బొగ్గు ఉత్పత్తి పనులు ప్రైవేట్‌కు అప్పజెప్పేందుకు ఆలోచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు

జూలూరుపాడు: మండల కేంద్రంలో బుధవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఆనంద్, జాతీయ కార్యవర్గ సభ్యులు దుద్దుకూరి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు బాపట్ల మురళీ, మోదుగు ప్రభాకర్‌లకు సభ్యత్వాలు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల విజయ భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కే జానీ, సుధాకర్, ఈశ్వర్, పూర్ణచందర్‌రావు, బండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కల్లంలో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న వలస కూలీలు

రైతు కంట కన్నీరు..

- రోజురోజుకు పతనమవుతున్న మిర్చి ధర
- పెట్టుబడులు రాక ఆందోళన చెందుతున్న రైతులు
- గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

జూలూరుపాడు: ఈ ఏడాది మిర్చి పంట రైతు కంట కన్నీరు పెట్టిస్తోంది. మార్కెట్‌లో రోజురోజుకు మిర్చి ధర తగ్గిపోతుండడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గత ఏడాది తెగుళ్లు సోకడంతో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోగా, ఈ ఏడాది కొద్దో గొప్పో పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది మండల వ్యాప్తంగా మిర్చి పంటకు వైరస్, తెగుళ్లు సోకి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. అయితే మార్కెట్‌లో మిర్చి పంటకు మద్దతు ధర లభించింది. ఈ ఏడాది మార్కెట్‌లో క్వింటా రూ.14,000 ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు రూ.11,000 – రూ.12,000 మించి కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. కల్లాల్లోని మిర్చి పంటను కొనుగోలు



గిట్టుబాటు ధర లేదని మిర్చిని చూపుతున్న రైతు

చేసి నగదు చెల్లిస్తే క్వింటా రూ.10,000కే కొనుగోలు చేస్తున్నారని, పెట్టుబడి పెట్టిన వ్యాపారులు రూ.13,000లకు కొనుగోలు చేసి, ఖాతా కింద జమ చేసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పంట చేతికి వచ్చే సమయానికి రోజురోజుకు మార్కెట్‌లో ధర తగ్గుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

జనవరి మూడో వారంలో క్వింటా రూ.18,000 ఉండగా ఫిబ్రవరి మొదటి వారంలో రూ.14,000లకు పడిపోయింది. మిర్చి సాగు కోసం చేసిన అప్పులు కూడా తీరే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. ఒకవైపు కూలీల కొరత, మరోవైపు అధిక పెట్టుబడులు, ఇంకోవైపు పండించిన పంటకు గిట్టుధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తోటల్లో మిరప కాయను కోసేందుకు కూలీల కొరత ఏర్పడటంతో చుట్టుపక్కల జిల్లాల నుంచే కాక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో ధర తగ్గడంతో వ్యాపారులు కూడా పంటను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని, వచ్చిన వ్యాపారులు కూడా అతితక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో వేల క్వింటాళ్ల మిర్చి కల్లాల్లోనే రాశులుగా పోసి ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కనీసం రూ.18,000 గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా రాదు..



ఎకరం రూ.50 వేల చొప్పున 30 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేసిన. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.2.25 లక్షలు అయింది. ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

– మేకల రామారావు, రైతు, అనంతారం

గిట్టుబాటు ధర కల్పించాలి..



మిర్చికి క్వింటా రూ.20 వేల మద్దతు ధర కల్పించాలి. ప్రస్తుతం రూ.14,000 పలుకుతోంది. మార్కెట్‌లో రూ.10,000 – రూ.12,000లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి బాగానే వచ్చింది. పంట చేతి వచ్చే సమయానికి ధర పడిపోయింది.

– భూక్యా రత్నకుమార్, రైతు, గంగారం తండా

మిర్చి సాగుతో నష్టం..



ఈ ఏడాది మిర్చి పంటకు ధర లేకపోవడంతో రైతులకు నష్టం వస్తుంది. ఏటా ఏదో ఒకరకంగా నష్టపోవాల్సి వస్తోంది. గత ఏడాది తెగుళ్లు రాగా, ఈ ఏడాది పంట పండినప్పటికీ ధర లేదు. వెంటనే నగదు చెల్లిస్తే క్వింటా రూ.10,000లకు అడుగుతున్నారు.

– మంగమ్మ, రైతు, గుండెపుడి

‘ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు అన్యాయం’

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు అన్యాయం చేశారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాలలకు మాత్రం న్యాయం చేసే విధంగానే వర్గీకరణ ఉందని ఆరోపించారు. ఎస్సీ సీ గ్రూపులో ఆర్థికంగా ఎదిగిన మాల ఉపకులాలైన మన్నెమాల కులస్తులు గంటా చక్రపాణి, పంబాల కులమైన గద్దర్ కులాలకు న్యాయం చేయడం కోసం ఏ గ్రూపులో అత్యంత వెనుకబడిన కులాలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ వర్గీకరణతో జాతీయ కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలు మాలల పక్షమేనని తేలిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఎంపీలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్‌ఖర్గే, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టి డిమాండ్ చేయాలని కోరారు.

11 శాతం రిజర్వేషన్ కల్పించండి..

జూలూరుపాడు: మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దిబ్బెందుల సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయ బద్ధంగా లేదని, మాదిగలకు అన్యాయం జరిగిందన్నారు. జనాభా దామాషా ప్రకారం, వెనకబాటు ఆధారంగా మాదిగలకు దక్కాల్సిన వాటా దక్కలేదనీ, ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 11 శాతం ఇవ్వాల్సిందేనన్నారు. లక్షల డప్పులు–వేల గొంతుల కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని, అతి త్వరలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తేదీ ప్రకటిస్తారన్నారు.

నులిపురుగుల నివారణపై సమీక్ష



మాట్లాడుతున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు సహకరించాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నులిపురుగుల నివారణ దినోత్సవ నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణ లక్ష్యంగా ఐదు నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు ఈ నెల 10వ తేదీన ఆల్బెండజోల్ బిళ్లలను మింగించాలని సూచించారు. దీనికోసం మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మందులు వేసేందుకు సిబ్బందిని నియమించామని, సహాయకులుగా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు సహకరించాలని కోరారు. 10న మందు వేసుకోని వారిని గుర్తించి తిరిగి 17వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో వారికి విధిగా మందులు వేయాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై స్పందించాలి

ఇల్లెందు: ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్ నూతన కార్యవర్గాన్ని, ఫిట్ సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీలను బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఆయా విభాగాల అధికారులకు పరిచయం చేశారు. బుధవారం ఇల్లెందు ఏరియాలోని వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు కార్మికుల సమస్యలపై నిత్యం స్పందిస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. వర్క్‌షాప్ ఫిట్ కమిటీ కార్యదర్శిగా ఎం.భూషణం, సహాయ కార్యదర్శిగా జక్కుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మంగపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వెంకటరెడ్డి, రామలింగేశ్వరరావులతో పాటు 11 మంది డెలిగేట్స్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్, వెంకట్‌రెడ్డి, దాట్ల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అమలుకు నోచుకోని కాంగ్రెస్ హామీలు



మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సమస్యలు, ఆరు గ్యారంటీల అమలు కోసం ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం రైటర్ బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో డివిజన్ నాయకులు మోత్కూరి మల్లికార్జున్‌రావు అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సర్వేలు నిర్వహించి గ్రామసభలలో వ్యతిరేకత వస్తుందని తెలిసి, ఎన్నికల కోడ్ పేరుతో పథకాన్ని వెనక్కి నెట్టారన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, తెలంగాణ అమరవీరులకు తెలంగాణ ఉద్యమకారులకు, మీడియా ప్రతినిధులకు భూమి లేని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని, ఇంటి స్థలాలు ఇస్తామని హామీల వర్షం కురిపించి విస్మరించారన్నారు. రైతుభరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థుల రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అటకెక్కాయని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని, వాటితోపాటు 420 హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఉమర్, వల్లోజు రమేష్, ఎన్.సంజీవ్, మంజుల, సురేష్, మారుతీరావు, అలీమొద్దీన్, నిర్మల, సంధ్య, కృష్ణ, నరసింహా, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించండి..

ఇల్లెందు: సత్యనారాయణపురంలో 1957లో కొనుగోలు చేసిన భూములను ఈ రోజు తమ భూములుగా పేర్కొంటూ కాజేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పి కొనుగోలు చేసిన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు తహసీల్దార్ రవికుమార్‌ను వేడుకున్నారు. బుధవారం ఇల్లెందు తహసీల్ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్న ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై విచారణ జరిపించాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: అన్నారుపాడు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్షయ వ్యాధి నివారణకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో 100 రోజుల టీబీ నిక్షయ్ షివిర్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. పలువురు అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. దేశంలో 347 జిల్లాలో క్షయ వ్యాధి తీవ్రంగా ఉందని, అందులో తెలంగాణలో తొమ్మిది జిల్లాలు ఉండగా.. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నట్లు తెలిపారు. క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడటం, మెడ చుట్టూ, సంక, గజ్జలో గడ్డ వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అని చెప్పారు. క్షయ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా నాణ్యమైన మందులు, నెలకు రూ.1000 ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్కే డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ తప్సుమ్, సీహెచ్‌ఓ రామకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శిరీష, సూపర్‌వైజర్ రఫేల్, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్లు ఇవ్వండి..

జూలూరుపాడు: పెన్షన్ల సైట్‌ను ఓపెన్ చేయాలని కోరుతూ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ బుధవారం మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త పెన్షన్ల కోసం సైట్ ఓపెన్ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తి అయినప్పటికీ పెన్షన్ పెంచి ఇవ్వకపోవడం చూస్తే గత బీఆర్‌ఎస్ పాలన లాగే కొనసాగుతున్నట్లు ఉందన్నారు.

కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలైంది..



మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన హరిప్రియ, దిండిగల రాజేందర్

ఇల్లెందు: కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకాక బీఆర్‌ఎస్ నాయకుల మీద కేసులు పెడుతున్నారని, అక్రమ కేసులకు కేసీఆర్ సైన్యం ఎప్పటికీ భయపడదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, జిల్లా గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆరోపించారు. బుధవారం ఇల్లెందు సబ్ జైలులో ఉన్న టేకులపల్లి బీఆర్‌ఎస్ నేత, బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌ను ములాఖత్‌లో పరామర్శించారు. అనంతరం ఐతా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వారసత్వం నుంచి వచ్చిన వారే కింది స్థాయి నేతలను, గ్రామసభల్లో ప్రజల నుంచి తిరుగుబాటు వ్యక్తం కావటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని గ్రామస్థాయి నుంచి బీఆర్‌ఎస్ నేతలను ప్రలోభపెట్టి పార్టీలోకి చేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. లొంగని వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో వేల కేసులు అనుభవించిన కేసీఆర్ సైన్యం కాంగ్రెస్ అక్రమాలను తీవ్రంగా ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అధికారులు కాంగ్రెస్ నేతల చేతిలో కీలుబొమ్మలుగా మారి బీఆర్‌ఎస్ నేతలను ఇబ్బంది పెడుతున్నారని, టేకులపల్లిలో లక్కినేని సురేందర్‌ను, బెండాలపాడు, మణుగూరులో బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మీరంతా పింక్‌బుక్‌లోకి చేర్చబడతారని, 33 జిల్లాల్లో ఎక్కడ ఉన్నా వెతికి పట్టుకుంటామని హెచ్చరించారు. అడ్డదారుల్లో పయనించే అధికారులు పద్ధతులు మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పరుచూరి వెంకటేశ్వరరావు, ఎస్.రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, బొమ్మెర వరప్రసాద్‌గౌడ్, అజ్మీర భావ్‌సింగ్‌నాయక్, జాఫర్ హుస్సేన్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, బోడ బాలు, లాల్‌సింగ్ నాయక్, జబ్బార్, గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వెంటనే అమలు కోరుతూ ఈనెల 20న న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు బుధవారం మండలంలోని పోచారంతండా గ్రామంలో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వాంకుడోత్ శ్రీను, నేతలు మోతీలాల్, లింగ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం నేడు కల్లబొల్లి కబుర్లతో కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు న్యూడెమోక్రసీ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కిషన్, లక్ష్మణ్, రాజు, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మకం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: శాసనసభలో కులగణన, ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందటం చరిత్రాత్మకం అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును హర్షిస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు దండోర శ్రీను ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. మందా కృష్ణ మాదిగ లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు. శాస్త్రీయంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించి, బలహీన వర్గాలకు మేలు చేసిందన్నారు. కార్యక్రమంలో శ్రీను, గొడ్ల మోహన్‌రావు, యర్రంశెట్టి ముత్తయ్య, మహిపతి రామలింగం, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పానిశెట్టి వెంకటేశ్వర్లు, చింతలచెర్వు శ్రీనివాసరావు, అడుసుమల్లి సాయిబాబు, కాపా కృష్ణమోహన్‌రావు, బంకా అన్వేష్, బోగిన సందీప్, అల్వాల సందీప్, పెద్దిరాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయండి..



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పాల్వంచ: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు రైతులు, కార్మికుల వ్యతిరేకమైన మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, వీటిని రద్దు చేయాలని రైతు కార్మిక సంఘాల నాయకులు బండి నాగేశ్వరరావు, కె.బ్రహ్మచారి, కల్లూరి కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ... రైతు, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు దేశ సంపదను అప్పజెప్పేందుకే పనిచేస్తోందన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు, పేద రైతుల జీవితాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడతాయన్నారు. రైతులను వ్యవసాయానికి దూరం చేసి, ఉపాధి లేకుండా చేసే దుర్మార్గమైన చట్టాలని, కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలు అమలయితే సంఘటిత, అసంఘటిత కార్మికుల పనిదినాలు, ఉద్యోగ పని భద్రత, జీతాల పెంపు తదితర హక్కులను పూర్తిగా కోల్పోయి వీధిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇట్టి వెంకట్రావ్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, తులసీరాం, వీసంశెట్టి పద్మజ, విశ్వేశ్వరరావు, గోనెల రమేష్ పాల్గొన్నారు.

బొమ్మనపల్లి పాఠశాలలో ‘బాలమేళా’



విద్యార్థులతో బాలమేళా బృందం

టేకులపల్లి: తరగతి గదుల్లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానాన్ని, నైపుణ్యాలను పరిశీలించేందుకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా పరిశీలన బృందం బుధవారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల నైపుణ్యాలను, అభ్యాసన ప్రతిభ, సృజనాత్మకత అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం, విభిన్న నేపథ్యాల అంశాలను అడిగి సమాధానాలను రాబట్టారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ బృందంలో బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మంగీలాల్, అసిస్టెంట్ సెక్రటరీ రమేష్, సీఆర్పీ అబ్బయ్య ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



కరివారిగూడెం కాలనీ పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ జుంకీలాల్

జూలూరుపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాలతో డీఈఓ వెంకటేశ్వరాచారి సూచనతో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో బాలమేళా కార్యక్రమాన్ని ఎంఈఓ జుంకీలాల్ పడమటనర్సాపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నేతృత్వంలోని మానిటరింగ్ సభ్యులు కరివారిగూడెం, తవిసిగుట్టతండా, కరివారిగూడెం కాలనీ, కొమ్ముగూడెం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పాఠశాలల స్థితిగతులు, విద్యార్థుల సామర్థ్యాలు, ప్రతిభతోపాటు, పాఠశాలల్లో పెంచుతున్న పూల, ఔషధ మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తూనే పాఠశాలల మధ్య పోటీతత్వాన్ని పెంచాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. బాలమేళా కార్యక్రమం కింద మండలంలోని పడమటనర్సాపురం, పాపకొల్లు, జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మూడు బెస్ట్ స్కూళ్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఒక బెస్ట్ స్కూల్‌ను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జూలూరుపాడు, పాపకొల్లు స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పలు పాఠశాలలను మానిటరింగ్ సభ్యులు సందర్శించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, పాపకొల్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్ పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148